ప్రజావాణి..3 వినతులు



డీసీ మోహన్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేస్తున్న ప్రజలు

చందానగర్: చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3 వినతిపత్రాలు అందగా 1 రెవెన్యూ, 1 టౌన్‌ప్లానింగ్, 1 ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించినవన్నారు. కాగా సమస్యలను పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ పత్రాన్ని అందిస్తున్న అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. కొండాపూర్ డివిజన్ కొత్తగూడకు చెందిన శివశంకర్‌రెడ్డికి అత్యవసర వైద్యచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా (సీఎంఆర్‌ఎఫ్-ఎల్‌ఓసీ) ద్వారా మంజూరైన రూ.5 లక్షల ఆర్థిక సహాయం మంజూరుపత్రాలను బాధిత కుటుంబానికి సోమవారం అందించారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, చంద్రమోహన్‌సాగర్, కుమార్ పాల్గొన్నారు.

దుర్గామాత శోభాయాత్ర

పటాన్‌చెరు: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గోనెమ్మ బస్తీ, రామేశ్వరంబండ, జీహెచ్‌ఎంసీ కాలనీలలో నిర్వహించిన దుర్గామాత శోభాయాత్రలలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ అంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్యూటీమీట్ .. సైబరాబాద్ తరపున ఇన్‌స్పెక్టర్ మల్లేష్ ప్రాతినిధ్యం

జీడిమెట్ల: తెలంగాణ పోలీస్ అకాడమీలో ఈనెల 19వ తేదీ వరకు నిర్వహిస్తున్న డ్యూటీ మీట్ కార్యక్రమానికి సైబరాబాద్ తరపున ప్రాతినిధ్యం వహించడానికి జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ ఎంపికయ్యారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తొలిసారి నిర్వహిస్తున్న డ్యూటీ మీట్ కార్యక్రమానికి ప్రాతినిధ్యం వహించేందుకు పరీక్ష నిర్వహించగా అందులో జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేష్ ప్రతిభ కనబరిచారు. దీంతో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి మల్లేష్‌ను సెలెక్ట్ చేశారు. సైబరాబాద్ తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడంపై ఇన్‌స్పెక్టర్ మల్లేష్ సంతోషం వ్యక్తం చేశారు. ఆయనకు జీడిమెట్ల పీఎస్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

యూపీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌ఓ



రాయదుర్గం: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను శేరిలింగంపల్లి జోన్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుధాకర్‌లాల్ సోమవారం పరిశీలించారు. రాయదుర్గం వార్డు కార్యాలయంలో కొనసాగుతున్న యూపీహెచ్‌సీ పనితీరు, వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఇతర అంశాలను ఆయన పరిశీలించారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా, వైద్య సేవలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.


అక్షయ 'రాళ్ల' బడి

హెచ్‌సీయూ, మనూ యూనివర్సిటీల్లో హెరిటేజ్ రాక్స్

'పత్తర్ కే దిల్.. ఏక్ తా మే తాకత్ హై.. అనేక్ తా మే ఏక్‌తా.. 'మష్రూమ్ రాక్'.. వైట్ రాక్స్.. టెంపుల్ రాక్'లు హెరిటేజ్ రాక్స్‌గా గుర్తింపు పొందాయి. సహజ సిద్ధంగా ఏర్పడిన భారీ బండరాళ్లకు పెట్టిన పేర్లు ఇవి. నగరంలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్న రాతి సంపద హెచ్‌సీయూ, మనూ ఉర్దూ యూనివర్సిటీల్లో ఉండడం విశేషం. నగరంలో గుర్తించిన హెరిటేజ్ రాళ్లలో హెచ్‌సీయూ 'మష్రూమ్‌రాక్' ఉంది. వీటికి శతాబ్దాల చరిత్ర ఉందని చరిత్రకారులు చెబుతుంటారు. వీటి గురించి భావితరాలకు తెలిసేలా తగిన చర్యలు తీసుకుంటున్నారు. హెచ్‌సీయూలో 2,300 ఎకరాలు, 'మనూ'లో 200 ఎకరాలు కలిపి 2,500 ఎకరాలలో విభిన్న తరహాలో ఏర్పడిన భారీ బండరాళ్ల (రాక్స్)ను రక్షిస్తూ వస్తున్నారు.

-రాయదుర్గం

హెచ్‌సీయూలో ప్రభుత్వం గుర్తించిన హెరిటేజ్ రాక్ 'మష్రూమ్ రాక్'



ఉర్దూ విశ్వవిద్యాలయంలో..

- రాక్ సొసైటీ గుర్తింపు పొందిన ఉర్దూ విశ్వవిద్యాలయంలోని పత్తర్ కే దిల్, ఏక్‌తా మే తాకత్ హై పేర్లు కలిగిన రెండు బండరాళ్లకు మాత్రం 2500 మిలియన్ల ఏళ్ల చరిత్ర ఉందని, దక్కన్ పీఠ భూముల్లో భాగం అని చెబుతున్నారు. ముఖ్యంగా నాలుగు బండరాళ్లలో రెండు రాళ్లు పక్కపక్కనే ఉండడాన్ని గుర్తించి ఈ రాళ్లకు 'పత్తర్‌కే దిల్' అని నామకరణం చేశారు. రాళ్లన్నీ ఒకేచోట ఉండడంతో ఏక్‌తా మే తాకత్ హై (యునైటెడ్ వి స్టాండ్) అని నామకరణం చేశారు. అలాగే మరోచోట ఉన్న రాళ్లకు కూడా అనేక్ తా మే ఏక్‌తా (యూనిటీ ఇన్ డైవర్సిటీ) అని కూడా పిలుస్తున్నారు.



హెరిటేజ్ రాక్‌గా నగరంలో గుర్తింపు పొందిన మనూలోని పత్తర్ కే దిల్



రాక్స్ పేరిట వీకెండ్స్ వాక్

- విభిన్న రాష్ట్రాలు, భాషలు, కులాలు, మతాలకు చెందిన వారితో మినీ భారత్‌గా మారిన హెచ్‌సీయూలో విద్యార్థులలో ఐక్యత బలపడేలా చేసేందుకు హెచ్‌సీయూ ఎక్స్‌ప్లోరర్ పేరిట వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేశారు. ఈ గ్రూపు ద్వారా వీకెండ్స్‌లో వాక్‌లను నిర్వహిస్తున్నారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లో మష్రూమ్ రాక్, వైట్ రాక్, టెంపుల్ రాక్, వర్జిన్ రాక్, వైట్ రాక్స్, హైరాక్స్, సాసర్ రాక్, కోన్ రాక్ కాంప్లెక్స్ ఇలా రకరకాల పేర్లతో ఈ బండరాళ్లను విద్యార్థులు పిలుస్తుంటారు.



హెచ్‌సీయూలో రాక్స్ వాక్



హెచ్‌సీయూలోని పురాతన రాతితో ఓ విద్యార్థి తయారు చేసిన హెచ్‌సీయూ సింబల్



యూనిటీ ఇన్ డైవర్సిటీ- 'అనేక్ తా మే ఏక్‌తా' పేరుతో భారీ రాళ్లు

కాశీ విద్యాపీఠంతో 'మనూ' ఒప్పందం



రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం సోమవారం వారణాసి మహాత్మాగాంధీ కాశీ విద్యాపీఠం (ఎంజీకేవీపీ)తో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ముఖ్యంగా విద్యావేత్తలు, పరిశోధన, సలహాలు, శిక్షణ, జ్ఞానాన్ని పంచుకోవడం, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్, విద్యార్థుల మార్పిడి, రెండు సంస్థలలో ఉమ్మడి కార్యక్రమాల నిర్వహణపై ఒప్పందం చేసుకున్నారు. 'మనూ' వీసీ ప్రొ. సయ్యద్ ఐనుల్ హసన్, ఎంజీకేవీపీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆనంద్‌కుమార్‌త్యాగి సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ఐదేళ్ల పాటు ఉంటుంది. కార్యక్రమంలో ప్రొఫెసర్లు సయ్యద్ నజాముల్ హసన్, మహ్మద్ ఫరియాద్, సల్మా అహ్మద్ ఫారూఖీ, సనీమ్‌ఫాతిమా పాల్గొన్నారు.

నేడు ,రేపు వర్క్‌షాప్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు ఉర్దూ రచయితల వర్క్‌షాప్ జరగనుంది. ఉర్దూ ఉన్నత విద్య కోసం పాఠ్య పుస్తకాలను అభివృద్ధి చేయడానికి, అకడమిక్ రైటింగ్‌పై ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తారు.నూతన విద్యావిధానం-2020కి అనుగుణంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, భారతీయ భాషా సమితి (బీబీఎస్) ద్వారా చొరవ తీసుకుంది. మనూ నోడల్ విశ్వవిద్యాలయంగా గుర్తింపు పొందింది. మంగళవారం ఉదయం 11 గంటలకు 'మనూ'లోని లైబ్రరీ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు, యూజీసీ కార్యదర్శి, ఉస్మానియా మాజీ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.సులేమాన్ సిద్దిఖీ, అలీఘర్ ముస్లిం విశ్వవిద్యాలయం ప్రొ.ఇంతియాజ్ హసన్ పాల్గొంటారు.

మిస్ యూనివర్స్ చందన సందడి

గచ్చిబౌలి: వస్త్రం బై సింఘానియాలో మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్- 2024 చందన జయరామ్ సందడి చేశారు. సోమవారం గచ్చిబౌలిలోని ప్లాటినాలో వస్త్రం బై సింఘానియాస్ మొదటి స్టోర్‌ను చందన జయరామ్ ప్రారంభించారు. మగువల మనోభావాలు, ఫ్యాషన్ ట్రెండ్స్‌కు అనుగుణంగా వస్త్రోత్పత్తులు ఆకట్టుకుంటున్నాయని ఆమె పేర్కొన్నారు. ఫ్యాషన్ డిజైనర్, వస్త్రం బై సింఘానియాస్ డైరెక్టర్ శైలేష్ సింఘానియా మాట్లాడుతూ ఫాస్ట్ ఫ్యాషన్ ఉత్పత్తులతో పాటు చీరలు, రెడీ టు వేర్ వంటి ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు.



స్టోర్‌ను ప్రారంభిస్తున్న మిస్ యూనివర్స్ చందన

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 60, పచ్చిమిర్చి 60, బెండ 50, కాకర 50, దొండ 50, దోస 50, ఆలు 40, చామ 50, కీర 35, బీర 60, వంకాయ 70, గోకర 60, బీన్స్ 120, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు 80, ఉల్లి 70(కేజీ), ములక్కాయలు (1)10 ,50, సొరకాయ (కేజీ) 30, అల్లం 180, వెల్లుల్లి 300.

వృత్తి విద్య కోర్సులపై అవగాహన

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ ఆదర్శ కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 10 రోజుల వృత్తి విద్య శిక్షణ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న 14 మంది ఒకేషనల్ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి అభినందించారు. క్షేత్రస్థాయిలో శిక్షకురాలు సమీరాఖాన్ ఆధ్వర్యంలో సూపర్ మార్కెట్లు, జనరల్ కిరాణా స్టోర్ వంటి వ్యాపార సముదాయాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. రిటైల్ రంగంలో వృత్తివిద్య నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. కార్యక్రమంలో కళాశాల ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు



నానక్‌రాంగూడలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్‌రావు, రవికుమార్‌యాదవ్, గంగాధర్‌రెడ్డి

'మినీ ఇండియా' శేరిలింగంపల్లి

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- నానక్‌రాంగూడలో బీజేపీ సభ్యత్వ నమోదు

రాయదుర్గం: శేరిలింగంపల్లి నియోజకవర్గం 'మినీ ఇండియా'గా గుర్తింపు పొందిందని మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని నానక్‌రాంగూడలోని హనుమాన్ ఆలయం వద్ద బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో అత్యధికంగా నార్త్ ఇండియన్స్, ఐటీ ఉద్యోగులు ఉంటారని, ప్రతి ఇంటికి వెళ్లి పార్టీ సభ్యత్వం స్వీకరించేలా చూడాలని సూచించారు. శేరిలింగంపల్లిలో 8 లక్షల ఓటర్లు ఉన్నారని పార్టీ కార్యకర్తలు, నాయకులు బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం నానక్‌రాంగూడలో దుకాణాలకు వెళ్ళి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో రఘునందన్‌రావుతోపాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా రేడియల్ రోడ్డు





రేడియల్ రోడ్డులో ఇసుక

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రేడియల్ రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను పరిష్కరించాలని ఏళ్ల తరబడి పలుమార్లు నిరసనలు తెలిపినా పాలకులు పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోయారు. 2015లో శేరిలింగంపల్లి పరిధిలోని గోపన్‌పల్లి నుంచి తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్ మీదగా కొల్లూరు రింగ్‌రోడ్డు వరకు ఓఆర్ఆర్ 30 ఎక్స్‌టెన్షన్ రోడ్డును అభివృద్ధి చేశారు. 2015లో ప్రారంభమైన రేడియల్ రోడ్డును నేటికి పూర్తిచేయలేదు. అనేక కాలనీలను కలుపుతూ ఈ రోడ్డును ప్రారంభించారు. నిత్యం ఈమార్గం నుంచి వేలాది వాహనల రాకపోకలు సాగిస్తున్నాయి. అసంపూర్తిగా ఉన్న రోడ్డుపై సగ భాగం ఇసుకతో నిండి పోయింది. కనీసం అధికారులు ఇసుకను తొలగించలేదు. నిత్యం ఈ రోడ్డుపైనే భారీ వాహనాలను నిలుపుతున్నారు. దాంతో ఈ రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ఈ క్రమంలో స్థానికులు రోడ్డును అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రికి లేఖ రాస్తామని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును త్వరగా పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మాజీ మంత్రిని కలిసిన నేతలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మాజీమంత్రి హరీశ్‌రావును ఆయన నివాసంలో సోమవారం స్థానిక నేతలు కలసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. మాజీమంత్రిని కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, మాజీ గ్రంథాలయ డైరెక్టర్ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, సీనియర్ నాయకులు ఆదర్శరెడ్డి తదితరులుఉన్నారు.



పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

సరికొత్త రుచులకు వేదికగా నగరం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ఖైరతాబాద్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బ్రాండ్లు తమ బ్రాంచీలను నగరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గుజరాత్‌లో ఎంతో ప్రాచుర్యం పొందిన హెల్లి అండ్ చిల్లీ రెస్టారెంట్‌ను ఆయన ఖైరతాబాద్‌లో కార్పొరేటర్ విజయారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆహార రంగంలో నగరం రోజురోజుకు అభివృద్ధి చెందుతుందని ఏ దేశానికి చెందిన వారు వచ్చినా వారి ఆహారపు అలవాట్లకు తగినట్లుగా ఆహారం దొరుకుతుందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు షుజావుద్దీన్ మాట్లాడుతూ ఈ రెస్టారెంట్ ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సైతం నమోదై ఉన్నదని నాణ్యమైన సేవలకు ఇది పేరుగాంచిందని అన్నారు. వినియోగదారులు సరికొత్త అనుభూతికి లోనయ్యేలా బర్గర్, కాఫీలలో వారి పేర్లతో అందిస్తామని అన్నారు.

తుపాకులతో దొంగల సంచారం

స్థానికుల అప్రమత్తతతో పలాయనం

గచ్చిబౌలి: దొంగలు తుపాకులతో అర్ధరాత్రి చోరీకి యత్నం చేసినట్లు టీఎన్‌జీఓస్ కాలనీవాసులు తెలిపారు. దీన్ని స్థానికులు పసిగట్టి కేకలు వేయడంతో పారిపోయారని కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు గడ్డం జంగయ్య తెలిపారు. శనివారం అర్ధరాత్రి 1 గంట సమయంలో ముగ్గురు ముసుగు దొంగలు ప్లాట్ నంబర్ 172,173,174 వద్ద రెక్కీ నిర్వహించారని పేర్కొన్నారు. ప్లాట్ నెంబర్ 173 వద్ద వెనక నుంచి వచ్చిన దుండగులు కిటికీలో నుంచి తుపాకీ గురిపెట్టడాన్ని పక్కన హాస్టల్‌లో ఉన్న యువకులు గమనించి కేకలు వేయడంతో ఇళ్లలో ఉన్న వారు బయటకు రావడంతో పారిపోయారని చెప్పారు. కాలనీలో వెనక నుంచి రావడంతో వారిని గుర్తించలేకపోయామన్నారు. డయల్ 100కు కాల్ చేశామని, గచ్చిబౌలి పోలీసుల దృష్టికి తీసుకెళ్లామని ఆయన తెలిపారు.కాగా దొంగలు తుపాకులతో సంచరించినట్లు ఎలాంటి ఆధారాలు లేవని, లిఖిత పూర్వక ఫిర్యాదు అందలేదని గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపారు.



చందానగర్ డివిజన్ పరిధిలోని రాజేందర్‌రెడ్డి నగర్ పార్కులో కానరాని పచ్చదనం



విరిగిన ప్రహరీ

రాజేందర్‌రెడ్డినగర్ పార్కు.. నిరుపయోగం

కనీస వసతులు నిల్

చందానగర్ : చందానగర్ డివిజన్ పరిధిలోని రాజేందర్‌రెడ్డినగర్ పార్కు అభివృద్ధికి నోచుకోలేదు. కనీస వసతులు కరువయ్యాయి. గతంలో ఈ పార్కుకు ప్రహరీ లేకపోవడంతో కబ్జాకు ప్రయత్నించినప్పుడు పలు దినపత్రికలలో కథనాలు రావడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రహరీ నిర్మించారు. కాగా ఈ పార్కులో చెత్త చెదారానికి నెలవుగా మారింది. జీహెచ్‌ఎంసీ అధికారులు నగరంలోని పార్కులను అభివృద్ధి చేస్తున్న సందర్భంగా రాజేందర్‌రెడ్డినగర్ పార్కును కూడా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. పార్కులో పచ్చదనం పెంపొందించడంతో బాటు వాకింగ్ ట్రాక్, చిన్నారుల కోసం ఆట వస్తువులు, ఓపెన్‌జిమ్, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



పార్కులో చెత్త చెదారం

పార్కును అభివృద్ధి చేయాలి



పార్కు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి. కనీస వసతులు కల్పించాలి. పచ్చదనంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పేలా అధికారులు కృషి చేయాలి.

-అశోక్, కాలనీవాసి

ఎడారిగా మారింది



పార్కులో చిన్నారుల కోసం ఆట వస్తువులు ఏర్పాటు చేయాలి. చిన్న పిల్లలతో సేదతీరడానికి వస్తే పార్కు ఎడారిగా మారింది. చెత్త చెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలి. సౌకర్యాలు కల్పించాలి.

- కామేశ్వర్‌రావు, కాలనీవాసి